క్లుప్తంగా

కరాటేలో ఎస్ఎస్ ప్రజ్ఞ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ నిహార్, కోచ్ హేమంత్‌కుమార్

కంకిపాడు: జాతీయ కరాటే పోటీల్లో కంకిపాడు ఎస్ఎస్ ప్రజ్ఞ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మీ, ప్రిన్సిపాల్ ఎస్.నిహార్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. 2వ జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్–2023 గతనెల 26న విజయవాడలో నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో వ్యక్తిగత కటా విభాగంలో పాఠశాల విద్యార్థులు 16 మంది పతకాలు సాధించారన్నారు. రెండు బంగారు పతకాలు, ఆరు రజత పతకాలు, 8 కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారన్నారు. విద్యార్థులను, కోచ్ కె.హేమంత్‌కుమార్‌ను అభినందించారు.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తులు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ కోర్సులు అభ్యసించేందుకు అర్హులని చెప్పారు. అభ్యర్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ, సర్టిఫికెట్లు జారీచేయడంతో పాటు ప్రముఖ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటోలతో స్కిల్ హబ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9666615539, 9494005725 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఆపరేషన్ ఈఈ పి. హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, అజ్జంపూడి, బుద్దవరం, బూతిమిల్లిపాడు, వెంకటనరసింహాపురం కాలనీ, ఎస్ఎల్వీ లైలా గ్రేటెడ్ కమ్యూనిటీ ఏరియాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల గృహ, ఇండస్ట్రీయల్, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సొసైటీ భవనం శంకుస్థాపన

విజయవాడరూరల్: విలేజి కుందావారి కండ్రిక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని సొసైటీ చైర్మన్ మూళగొళ్ళ రవీంద్ర రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సుమారు రూ.43 లక్షలతో నిర్మించే ఈ భవనంలో ప్రెసిడెంట్ రూమ్‌తో పాటు సమావేశం హాలు, గోల్డ్‌లోనుకు అవసరమైన లాకర్లు గల స్ట్రాంగ్ రూమ్, స్టాఫ్ రూమ్ నిర్మిస్తామన్నారు.

రేపు సాయిబాబా మందిర వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాసనగర్‌లో షిరిడి సాయిబాబా మందిర 28వ వార్షికోత్సం ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్నామని సాయిసేవా సమితి తెలిపింది. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. 4వ తేదీ ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు బాబా మంగళస్నానం, 6.30 గంటలకు దోనేపూడి దుర్గాప్రసాద్ దంపతులు 108 లీటర్ల ఆవుపాలతో బాబాకు పాలాభిషేకం చేస్తారన్నారు. ఉదయం 7 గంటలకు తుమ్మలపల్లి హరికృష్ణ దంపతులచే పళ్లరసంతో అభిషేకం, ఉదయం 8 గంటలకు బాబాకు మారేడు, తులసి దళాలతో పూజలు, ఉదయం 8.30 గంటలకు అన్నాభిషేకం, 9 గంటలకు విష్ణు సహస్రనామపారాయణ, 9.30 గంటలకు గులాబి పూలచే విశేష పూజలు, 10 గంటలకు బాబా పాదుకా ఉత్సవం, ఉదయం 11 గంటకు భక్తులను అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ కోరింది.

ఓటర్ల జాబితా ప్రదర్శన

ఉంగుటూరు: తేలప్రోలు–1 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రదర్శనగా ఉంచారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ఖాళీగా ఉన్న తేలప్రోలు–1 సెంగ్మెంట్‌లో 2023 జనవరి నెల నాటికి అర్హత ఉన్న ఓటర్ల జాబితాను తనిఖీ నిమిత్తం ప్రదర్శనగా ఉంచినట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరి రావు తెలిపారు. తదుపరి ఆదేశాల ప్రకారం ఎంపీటీసీ సభ్యుని ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అసౌకర్యాల అగచాట్లకు తెర!

- నూతన భవనంలోకి సామాజిక ఆరోగ్య కేంద్రం
- అందుబాటులోకి అన్ని విభాగాలు
- మెరుగైన వైద్యం అందుతుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు



కంకిపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం నూతన భవనం

కంకిపాడు: ఇరుకు ఇక్కట్లు...అసౌకర్యాల అగచాట్లకు తెరపడింది. పెరుగుతున్న రోగుల సంఖ్య.. అందుబాటులోకి వచ్చిన వసతులతో వైద్య సేవలు మరింత మెరుగ్గా అందుతున్నాయి. అధునాతన యంత్ర పరికరాలను వినియోగిస్తూ వార్డులను ఏర్పాటుచేశారు. వైద్యసేవల మెరుగుదలతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నూతన భవనంలోకి సీహెచ్‌సీ...

కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం గతంలో పోలీసుస్టేషన్ రోడ్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలో నడిచేది. ప్రతి రోజూ 250 నుంచి 300 మందికి వైద్య సేవలు అందేవి. గైనికాలజీ, పీడియాట్రిక్, మత్తు, జనరల్, జనరల్ సర్జరీ, ఫిజియోథెరపీ, తదితర విభాగాలకు చెందిన నిపుణులైన ఎనిమిది మంది వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందిస్తున్నారు. అయితే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలోనే సీహెచ్‌సీ సేవలు అందుతుండటంతో వైద్యసేవలు అందించే సిబ్బంది, వైద్యం కోసం వచ్చిన రోగులు ఇరుకు గదుల్లో అవస్థలు పడాల్సి వచ్చింది. సీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణానికి పట్టణానికి చెందిన దాత అక్కినేని గోపాలకృష్ణమూర్తి 1.69 ఎకరాల భూమిని వితరణగా అందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాబార్డు నిధులు రూ. 4.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో అధునాతన హంగులతో 30 పడకల సామర్థ్యం గల ఆసుపత్రి భవనం నిర్మించారు. గతనెల 24న ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా అక్కినేని గోపాలకృష్ణమూర్తి, సుగుణ సామాజిక ఆరోగ్యకేంద్రంను ప్రారంభించారు. ఆసుపత్రి భవనం ప్రారంభంతో వైద్యసేవలు నూతన భవనంలో అందుబాటులోకి తెచ్చారు. గడిచిన నాలుగు రోజులుగా కొత్త భవనంలోనే వైద్య సేవలు అందుతున్నాయి. ఇప్పటికే ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో యంత్రపరికరాలు, సామగ్రిని ఏర్పాటుచేశారు. రోగులకు మెరుగ్గా సేవలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ సమర్థంగా చర్యలు తీసుకుంది.



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు డాక్టర్ సంజయ్

పరికరాలు కేటాయింపు....

ఇప్పటికే ఫిజియోథెరపీ, ఎక్స్‌రే, దంత వైద్యం, ఆపరేషన్ థియేటర్‌లకు సంబంధించిన యంత్రపరికాలు, సామగ్రి అందుబాటులో ఉన్నాయి. నూతన భవనం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో అవసరమైన పరికరాలను కేటాయించారు. రూ.23 లక్షలు విలువ చేసే మూడు అనలైజర్లు, రెండు బ్లడ్ స్టోరేజ్ యూనిట్స్, డయాథెర్మి, ఆటో క్లేవ్, లేబర్ వార్డు టేబుళ్లు, పడకలను సరఫరా చేశారు. పరికరాల బిగింపుతో మరింత సమర్థంగా సేవలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.8 లక్షలు అంచనా వ్యయంతో.....

సీహెచ్‌సీ భవనంలో రోగులకు మరిన్ని వసతులు కల్పించేలా ఏపీఎస్ఎంఐడీసీ చర్యలు తీసుకుంది. లక్ష్య కార్యక్రమం కింద ఆసుపత్రికి రూ.8 లక్షలు నిధులు కేటాయించింది. ఈ నిధులతో అదనపు మరుగుదొడ్లు, బయో ల్యాబ్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు చేపట్టారు. నూతన వసతులు అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.



సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న పడకలు



అందుబాటులోకి వచ్చిన నూతన బ్లడ్ స్టోరేజ్ యూనిట్

వైద్యం మరింత మెరుగ్గా



గతంలో వైద్యులు, రోగులు పీహెచ్‌సీ భవనంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లు. ఇరుకు వాతావరణం, సరైన వసతులు లేక అవస్థలు పడ్డారు. ప్రభుత్వ చొరవ, దాతల సాయంతో నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. వసతులు మెరుగయ్యాయి. కంకిపాడు పరిసరాల్లోని 42 గ్రామాల ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–మేదంద్రావు కుటుంబరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కంకిపాడు సీహెచ్‌సీ

సమర్థంగా వైద్య సేవలు



నూతన ఆసుపత్రి భవనంలో యంత్ర పరికరాల ఏర్పాటు, వసతుల కల్పన దాదాపుగా పూర్తయ్యింది. పీహెచ్‌సీలో ఉన్న కొద్దిపాటి సామగ్రిని తరలించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు మెరుగ్గా, సమర్థంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు విజయవాడ ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మెరుగ్గా వైద్య సేవలు అందించేలా, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తాం.

–డాక్టర్ సంజయ్, వైద్యాధికారి, కంకిపాడు సీహెచ్‌సీ

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఉంగుటూరు: చదువుకోవాలని ఉంటే సాయం అందించేందుకు ఎమ్మెల్యే వంశీ అన్ని వేళల సిద్ధంగా ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆత్కూరులో సొంగా నాగేశ్వరరావు కుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. అయితే ఆర్థిక ఇబ్బంది వలన ఫీజులు కట్టలేక తన పరిస్థితిని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే వంశీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు నుంచి రూ.25 వేలు ఆ విద్యార్థికి అందజేయాలని స్థానిక నాయకులకు సూచించారు. పేదరికంతో ఉన్నత విద్యను అభ్యసించలేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులు వెచ్చించడం హర్షణీయమని పలువురు ప్రశంసించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సింహాచలం, చంటి, ఆశీర్వదం, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యతో వికాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒత్తిడి లేని విద్యతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని సైక్రియాటిస్టు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం సాయంత్రం మారుతీనగర్ గ్రోయింగ్ మైండ్స్ ప్లేస్కూల్ 5వ వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో విద్యను అందిస్తున్న గ్రోయింగ్ మైండ్స్ ప్లేస్కూల్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, వీడీఎస్ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్ బాబు ప్రసంగించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమాలను స్కూలు డైరెక్టర్ నాగ ప్రసన్న, ప్రతిమ పర్యవేక్షించారు.

నేటి నుంచి తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్లు



తెన్నేరు గ్రామంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవస్థానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో కొలవైయున్న తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం నుంచి తిరునాళ్ల ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ గురువారం తెలిపింది. తిరునాళ్ల తొలిరోజున తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ తేదీ నుంచి 6 వరకు మేళతాళాలు, కోలాటం, చెక్క భజనలతో సుంకర వారి ప్రభతో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. 7వ తేదిన ఆత్మూరి వారి ప్రభ, 8వ తేదిన కనుకుర్తి వారి ప్రభ, 9వ తేదీన లంక వారి ప్రభ ఊరేగింపు ఉంటుందని వివరించారు. 12వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తిరునాళ్ల చివరిరోజైన 12వ తేది సాయంత్రం అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

ఐదు రోజుల పాటు అమ్మవారి మహోత్సవాలు....

కంకిపాడు: తెన్నేరు గ్రామంలో వేంచేసిన లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజులు పాటు నిర్వహించనున్న తిరునాళ్ల మహోత్సవానికి ఆలయ నిర్వాహక ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల 102వ కల్యాణ తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేశారు. 3వ తేదీన కల్యాణోత్సవం, అనంతరం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం, 4వ తేదీన ఉదయం 10 గంటలకు అభిషేక మహోత్సవం, 5న ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమపూజలు, 6వ తేదీన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన, 7వ తేదీన పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ

నున్న(విజయవాడరూరల్): విఫ్స్ కార్యక్రమంలో భాగంగా నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ స్కూల్స్‌లోని విద్యార్థులకు వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గురువారం ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు. ప్రతి గురువారం ఈ టాబ్లెట్స్ తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. వారం వారం ఈ టాబ్లెట్స్ వాడటం వలన జ్ఞాపక శక్తి పెరిగి చదువుకొనేందుకు ఉపయోగపడతాయన్నారు. రక్తహీనత కల్గిన విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. నున్న జెడ్పీ హైస్కూల్లో 557 మంది విద్యార్థులకు టాబ్లెట్స్ అందచేసినట్టు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత తెలిపారు. ఎలిమెంటరీ పాఠశాలలో 120 మందికి ఇచ్చామని ఏఎన్ఎమ్‌లు రజని, శ్రీదేవి పేర్కొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న కాలనీ పెద్దలు

గన్నవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని జెడ్పీ బాలురోన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నిడమర్తి రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం రామారావు, తిరివీధి భిక్షాలు, నాని బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిడమర్తి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వల్ల మానవాళి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. దీనిని అధిగమించేందుకు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని చెప్పారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఇంటి ముందు కనీసం రెండు మొక్కలైన నాటడడంతో పాటు వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటుతున్న మత్స్య సంఘం, కాలనీ పెద్దలను అభినందించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి, మత్స్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్, సంఘ డైరెక్టర్లు నల్లమోతు ఆశీర్వాదం, ఎస్. రంగారావు, తిరివీధి మునేష్, ఎం. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో ఫుడ్ కమిషన్ సభ్యుడు తనిఖీ



రేషన్ మొబైల్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న లక్ష్మిరెడ్డి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలో రెండు రేషన్ షాపులు, రెండు మొబైల్ యూనిట్లను ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ ఏ విధంగా జరుగుతుంది తెల్ల రేషన్ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించారు. పాఠశాలలో ప్రభుత్వ పథకాల అమలుతో పాటు జగనన్న గోరు ముద్ద మెను అమలు, భోజనం నాణ్యత పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో బోధన ఏ విధంగా ఉందని విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పార్వతి, డీఎం శ్రీధర్, డీటీ భవాని, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఈ.లక్ష్మిరెడ్డి అన్నారు. ఉయ్యూరులోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌ను గురువారం ఆయన సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యంగా అందేలా చూడాలన్నారు. పిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఉయ్యూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి సరుకుల నాణ్యతను పరిశీలించారు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్, డీఎస్ఓ పార్వతి, డెప్యూటీ తహసీల్దార్లు భవాని, శ్రీనివాస్, కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

పెనమలూరు: రెండవ రోజు పింఛన్లు ముమ్మరంగా పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 17,962 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.4.99 కోట్లు ఇధులు మంజూరు చేసింది. గురువారం వలంటీర్లు అన్ని ప్రాంతాలకు వెళ్లి పింఛన్లు అందించారు. పెనమలూరులో కుటుంబ సభ్యులు లేని అనాధ వృద్ధుడు సిరిపురపు సూర్యనాగేశ్వరరావుకు పెనమలూరు సచివాలయ వలంటీర్ పవన్‌కుమార్ పింఛన్ అందచేశాడు. పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందచేస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు.

ఆసుపత్రి వెళ్లి పింఛను అందజేత

కంకిపాడు: విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి వలంటీరు వెళ్లి పింఛను అందజేశారు. ఈడుపుగల్లు–2 సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్న షేక్ బాజీ వృద్ధాప్య పింఛను లబ్ధిదారుడు. ఇటీవల అనారోగ్యానికి గురి కావటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేశారు. వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ క్రమంలో ఆ ప్రాంత వలంటీరు షకీనా బేగం లబ్ధిదారుడు బాజీ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న సమాచారం తెలుసుకుంది. వెంటనే ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించింది. వలంటీరు చొరవను ఈఓ బి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.



విజయవాడ ఆసుపత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీరు షకీనా బేగం

నైపుణ్యం పెంపుతో అభివృద్ధి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలు వృత్తి విద్యా నైపుణ్యం పెంచుకుని అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ప్రవీణ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధిని కల్పించే ఇలాంటి వృత్తిలో శిక్షణ పొందితే నలుగురికి ఉపాధి అందచేయవచ్చన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు స్వరూపరాణి మాట్లాడుతూ ఇప్పటికే 7 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణ విభాగం బాధ్యులు పి.విజయ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

410 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ఉయ్యూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 410 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపించి అవసరమైన మందులు అందించారు. 21 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థకు కళ్లజోళ్లు నిమిత్తం సమాచారం అందించారు. శిబిరాన్ని హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్

బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోరంకి చెందిన నాగిడి ధనలక్ష్మి తాడిగడప సెంటర్‌లో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లటానికి రోడ్డు దాటుతున్న సమయంలో కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపుకు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యి ఆస్పత్రిలో చేరింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

పెనమలూరు: భార్యాభర్తల తగాదా కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత గురువారం మృతి చెందింది. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు డొంకరోడ్డుకు చెందిన పి.పద్మావతి (36), నాగరాజు దంపతులు. భర్త నాగరాజు మున్సిపాలిటీలో చెత్త వాహనం డ్రైవర్‌గా పని చేస్తాడు. వీరికి వివాహం జరిగి 15 సంవత్సరాలు అయింది. పిల్లలు లేరు. కాగా భార్యాభర్తల మధ్య గొడవ జరగటంతో గత నెల 26వ తేదీన పద్మావతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను పటమటలో ప్రైవేటు ఆస్పత్రిలో అత్యవసర వైద్య చికిత్సకై చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె గురువారం మృతి చెందింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోండి

నున్న(విజయవాడరూరల్): జలజీవన్ మిషన్ పథకం కింద నున్న గ్రామంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నామని, అవసరమైన వారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో నున్న గ్రామానికి సుమారు నాలుగు కోట్ల రూపాయలు మంజూరైనట్టు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుళాయి కనెక్షన్ తీసుకునే వారు ప్రజల భాగస్వామ్యం క్రింద 10 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీలు 2,500, మిగిలిన వారు రూ.4 వేలు చెల్లించాలన్నారు.